

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యా శాఖ కృషి
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

# శత శాతమే.. లక్ష్యంగా..



తుర్కయంజాల్, డిసెంబర్ 22 : పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొదించి అమలు చేస్తున్నారు. ఈ నెల 31 వరకు సిలబస్ పూర్తి చేసేలా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ 100 శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని సూచిస్తున్నారు. అధికారులు ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి వారి సూచనల మేరకు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులును నిర్వహించాలని విద్యా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నారు. సబ్జెక్టుల వారీగా నిపుణులతో ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతూ ఉపాధ్యాయులకూ శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులు ఈ నెల 31 వరకు సిలబస్‌ను పూర్తి చేసి, పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు.

**ఉత్తీర్ణత పెంచే దిశగా చర్యలు..**

సకాలంలో సిలబస్ పూర్తి చేయడంతో పాటుగా ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 4:45 నుంచి 5:45 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. సిలబస్ పూర్తి చేసిన తరువాత జనవరి నుంచి పూర్తిస్థాయిలో ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థులకు గ్రాండ్ టెస్టు నిర్వహించి వారిని ప్రీ ఫైనల్ పరీక్షకు సిద్ధం చేయనున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం పూట అదనపు తరగతులు నిర్వహించి తర్ఫీదు ఇవ్వనున్నారు. ప్రతి పాఠశాలలో పూర్తిస్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**పరీక్షలంటే భయం పోయేలా చేస్తున్నాం..**



పరీక్షలంటే భయం పోయేలా పదో తరగతి విద్యార్థులను మానసికంగా సిద్ధం చేస్తున్నాం. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనుబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

**– తిరుపతి భాయి, ప్రధానోపాధ్యాయురాలు, కొహెడ ప్రభుత్వ పాఠశాల, తుర్కయంజాల్ మున్సిపాలిటీ**

**ప్రతి సబ్జెక్ట్‌పై పట్టు సాధించేలా..**



ప్రతి సబ్జెక్ట్‌పై విద్యార్థులు పట్టు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వమిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపాం. బట్టీ విధానం కాకుండా ఎలా గుర్తుంచుకోవాలో వివరిస్తున్నాం.

**– దన్నె రాజు, సోషల్ టీచర్, కొహెడ, ప్రభుత్వ పాఠశాల, తుర్కయంజాల్ మున్సిపాలిటీ**

**అదనపు తరగతులు చాలా ఉపయోగకరం..**



పాఠశాలలో అదనపు తరగతులు నిర్వహించడం చాలా ఉపయోగకరం. సబ్జెక్టులో సమస్యలు ఉంటే అదనపు తరగుతుల సమయంలో ఉపాధ్యాయుల వద్ద నుంచి తెలుసుకోవడానికి వీలు పడుతుంది. ప్రతి రోజు పరీక్షలు నిర్వహించడం వల్ల పరీక్షలంటే భయం పోయింది. ప్రతి సబ్జెక్టులో ఏ విధంగా మార్కులు సాధించాలనే అంశాలు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**– నీలిమ, పదో తరగతి, కొహెడ ప్రభుత్వ పాఠశాల, తుర్కయంజాల్ మున్సిపాలిటీ**

**ప్రత్యేక తరగతులు నిర్వమిస్తున్నారు..**



ప్రతి సబ్జెక్ట్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎలా రాస్తే మార్కులు బాగా వస్తాయో సూచించారు. మ్యాథ్స్, సైన్స్‌లో అధిక మార్కులు సాధించేలా శిక్షణ ఇచ్చారు.

**– చందన, పదోతరగతి, కొహెడ ప్రభుత్వ పాఠశాల, తుర్కయంజాల్ మున్సిపాలిటీ**

# బీ కేర్ ఫుల్

## జబ్బులకు కేరాఫ్ చలికాలం.. భద్రతతోనే ఆరోగ్యం పదిలం





యాలాల, డిసెంబర్ 22 : చలికాలంలో జబ్బులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. వేడి పదార్థాలు తినడంతో పాటు చలి నుంచి రక్షణ పొందేలా స్వెటర్లు, మంకీ క్యాపులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి తీవ్రత వల్ల జలుబు, దగ్గు వంటి చిన్న వాటితో పాటు తీవ్రమైన గుండెపోటు సమస్యకు దారి తీస్తుంది.

చల్లని వాతావరణం వైరస్ వృద్ధికి కారణం. జలుబుతో బాధపడే వారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వెలుపడే తుంపర్ల ద్వారా వైరస్‌లు గాలిలో కలుస్తాయి. ఇవి శ్వాస ద్వారా చుట్టుపక్కల ఉన్నవారికి సంక్రమిస్తాయి. ఈ తుంపర్లు అంటుకుపోయిన వస్తువులను తాకిన చేతులతో కండ్లు, ముక్కు రుద్దుకున్నా వైరస్ సోకుతుంది. ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారికీ ఇంకాస్త త్వరగా వ్యాపిస్తుంది. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**ఇన్‌పెక్షన్ల సమస్య అధికం..**

చల్లగాలికి ఊపిరితిత్తులు, వీటి లోపలి పొరలు విపరీతంగా స్పందిస్తాయి. పొడి వాతావరణం కారణంగా గాలిలో దుమ్ము, ధూళి ఎక్కువగా కలుస్తుంది. దీంతో అలర్జీ, ఆస్తమా, సీవోడీపీ బాధితులకు దగ్గు, ఆయాసం వంటి సమస్యలు తీవ్రమవుతాయి. కొందరికి వైరల్ ఇన్‌ఫెక్షన్లు, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌లకూ దారి తీయొచ్చు. ఉష్ణోగ్రత బాగా తగ్గినప్పుడు బయటకు వెళ్తే ముక్కులోని కణజాలం ఉబ్బిపోయి ముక్కుదిబ్బడ వేయవచ్చు. సైనసైటిస్‌తో బాధపడేవారికిది ఎక్కువ చిక్కులు తెచ్చే అవకాశం ఉన్నది.

**చల్లని వాతావరణం గుండెకు చేటు..**

చల్లని వాతావరణం గుండెకు చేటు చేస్తుంది. చలికాలంలో కొలెస్ట్రాల్, రక్తం గడ్డ కట్టడానికి తోడ్పడే ప్లేట్‌లెట్ల సంఖ్య పెరగొచ్చు. దీంతో రక్తం చిక్కగా మారి రక్తనాళాల్లో అడ్డంకులు సృష్టిస్తాయి. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో ఇలాంటి గడ్డలు ఉంటే గుండెపోటు వచ్చే అవకాశం ఉన్నది.

**సమతుల ఆహారం..**

చలికాలంలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారపదార్థాలను తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, సిట్రస్ పండ్లు, బ్రోకలీ, చిలగడదుంపలతో పాటు సీజన్‌లో దొరికే అన్ని రకాల పండ్లనూ తింటే మంచిది. కాచి చల్లార్చిన నీరు, వేడి వేడి ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

**క్రమం తప్పకుండా వ్యాయామం..**

సాధారణ రోజుల్లో మాదిరిగానే చలికాలంలో వ్యాయామం అనేది చాలా ముఖ్యం. శారీరక శ్రమ అనేది శరీర ఆకృతిని మెయింటెన్ చేయడమే కాకుండా మానసిక స్థితిని, రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. యోగా, జిమ్‌లో వ్యాయామం చేయాలి.

**జాగ్రత్తలు..**

రోజూ శరీరానికి ఎండ తగిలేలా చూసుకోవాలి. ఇంట్లోకి ఎండ, వెలుతురూ వచ్చేలా కిటికీలు తెరవాలి. చలి పెడుతుందని అస్తమానం ఇంట్లో కూర్చోకుండా నలుగురితో కలవాలి. మిత్రులు, బంధువులతో సరదాగా గడపాలి. చర్మానికి కొబ్బరినూనె రాసుకోవాలి. మాయిశ్చరైజర్లు వాడుకోవచ్చు. ఇవి చర్మంలో తేమను కాపాడుతాయి. మామూలు సబ్బులకు బదులు గ్లిజరిన్‌తో కూడిన సబ్బులు వాడుకుంటే మేలు. సున్నిపిండి వాడుకున్నా మంచిదే. ఎండుగజ్జి, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలు కలవారు స్వెటర్లు నేరుగా చర్మానికి తగలకుండా చూసుకోవాలి. ముందు నూలు దుస్తులు వేసుకొని, వాటి మీద ఉన్ని దుస్తులు, స్వెటర్లు ధరించాలి. చాలా మందికి చల్లగాలికి పెదాలు పగులుతుంటాయి. వైట్ పెట్రోలియం జెల్లీ పెదాలకు రాసుకుంటే ఉపశమనం కలుగుతుంది.



నవాబుపేట, డిసెంబర్ 22 : చారిత్రక యుగంలో శ్రీ గురుదత్తాత్రేయుడు, కలియుగంలో మొట్టమొదటి శ్రీపాద వల్లభుడిగా పిఠాపురంలో నరసింహ సరస్వతీగా, కారంజగానుగాపూర్‌లోనూ శ్రీ మాణిక్య ప్రభువుగా(1817–1865) హుమ్నాబాద్‌లో అవతరించాడు. మాణిక్‌ప్రభువు బడికిపోలేదు, ఏ చదువు చదువుకోలేదు కానీ వారు సర్వజ్ఞానులని అవతారమూర్తులని తమ పసిప్రాయములోనే రుజువు చేశారని భక్తుల నమ్మకం. సంతానంలేనివారికి సంతానం కలిగించే బోధన, ఆపదలో ఉన్న వారి కష్టాలు తీర్చి విశ్వరూప సందర్శన పద్ధతిలో అంతటా అవతరించి ఎందరినో కాపాడి భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లారు. మాణికప్రభువు భారతదేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించి తమ 28వ ఏట విరిజ గురుగంగా అనే చిన్న నదుల సంగమ స్థానంలో ప్రకృతి రమణీయమైన స్థలంలో ఇక బిల్వ వృక్షయు కింద స్థిరంగా నిలిచిపోయారని, దానినే నేడు ముమ్నాబాద్ మాణిక్య నగరంగా పిలుస్తారని ప్రభువు భక్తులు చెబుతున్నారు.

**ఆలయం చరిత్ర**

12 నవంబర్, 1939న నవాబుపేటలో మాణికప్రభువు ఆలయాన్ని నెలకొల్పారు. ఆనాటి నుంచి నేటి వరకూ నిత్యం విధి విధానాలతో పూజ అఖండ దీపారాధన భజన సంకీర్తన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మాణిక్యప్రభువు సమాధి మందిరం హుమ్నాబాద్ (బీదర్ జిల్లా) కర్ణాటక. తర్వాత ద్వితీయ శ్రేణిలో ప్రభువు నగర్ నవాబుపేటలో ఆలయ ఉత్సవాలు జరుగుతున్నాయి. నాలుగు దశాబ్దాలుగా నవాబుపేటలో ఉత్సవాలతో సేవలు అందిస్తున్నారు. వారి కుమారులు శ్రీ బాల మార్తండ మహారాజు మార్గదర్శనంలో ఇప్పటికీ అదే స్ఫూర్తితో అన్ని కార్యక్రమాలు కూడా ఏ కొరత లేకుండా జరుగుతున్నాయి. అప్పటినుంచి నవాబుపేట జాతరగా చాలా ప్రసిద్ధి చెందింది.

మాణిక్యప్రభువు వారసులు బాల మార్తాండ మహారాజు అధ్యక్షతన నేటి నుంచి నవాబుపేటలో 83వ ఆలయ వార్షికోత్సవాలను ఐదు రోజులుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మార్గశిర శుద్ధ ఏకాదశి 23వ తేదీ నుంచి సద్గురు మాణిక్యప్రభువు మహారాజు 158వ పుణ్యతిథి ఆరాధన కార్యక్రమముతో ఉత్సవం ప్రారంభం కానున్నది. ఐదు రోజులపాటు ప్రతీరోజూ మాణిక్యప్రభువు గాధీ.. పీఠానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం బిల్వార్చన.. చతుర్వేద సేవ.. రాజోపచార సేవలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. మధ్యాహ్నం మహానివేదన హారతి.. తరువాతి.. భక్త జనులందరికీ భోజన ప్రసాద వితరణ ఏర్పాట్లను చేశారు. రాత్రిపూట వివిధ గ్రామాలకు చెందిన భజన మండలితో తెల్లవారులు భజన సంకీర్తన కార్యక్రమం ఉంటుందని పండితులు తెలిపారు. 26వ తేదీన దత్తాత్రేయ సద్గురు మాణిక్యప్రభువు(208వ) జయంతి ఉత్సవం.. ఇది ప్రధాన ఘట్టం మహాపూజ తరువాత ఆంజనేయస్వామి ఊరేగింపు సేవ ఉంటుందని, ఇందులో రాకమచర్ల ఉమ్మెంతల పంచమ పీఠాధిపతులు వెంకటదాస్ మహారాజ్, జీవన్ముక్త కాశీనాథ్ దేవుని అంతారం సంస్థానం పీఠాధిపతి బాలరాజ్ మహారాజ్ విశిష్ట అతిథులుగా పాల్గొననున్నట్లు పండితులు తెలిపారు.

# పోదాం పద జాతర

## నేటి నుంచి మాణిక్యప్రభు 83వ వార్షికోత్సవం.. ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు.. నిత్య అన్నదానం, మహాప్రసాదం



విద్యుత్ కాంతులతో మాణిక్యప్రభువు ఆలయం

**ప్రతిసారి ప్రభువు సేవలో పాల్గొంటా..**



ఇక్కడ ఆలయం నిర్మించిన నాటి నుంచి మాణిక్యప్రభు సేవలో నేను పాల్గొంటున్నాను. వేదపండితుల మధ్య మాణిక్యప్రభువు ఉత్సవం జరుగడం పూర్వజన్మ పుణ్యంగా చెప్పాలి. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. మాణిక్యప్రభువు సంగీత దర్బారు కార్యక్రమాన్ని నేనే స్వయంగా నిర్వహించడం సంతోషంగా ఉన్నది. ప్రతి సంవత్సరం వేద మంత్రోచ్ఛరణాలతో మాణిక్యప్రభువుకు పూజలు, సంగీతకారులచే భక్తికీర్తనలు, ప్రభువు సేవలో పాల్గొనడానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించడానికి మా బృందం ప్రత్యేకమైన కృషి చేస్తున్నది. ఈ పూజా కార్యక్రమానికి ఉమ్మెంతాల పీఠాధిపతులు వెంకట దాసార్యులను విశిష్ట అతిథిగా ఆహ్వానిస్తున్నాం.

**– బాలమార్తండ మహారాజ్**

**సద్గురు జయంతిలో పాల్గొనడం అదృష్టం..**



గ్రామంలోని ప్రభునగర్‌లో ఉన్న సద్గురు మాణిక్యప్రభు జయంతిలో పాల్గొని భక్తికీర్తనలు వినడం ఎన్నో జన్మల పుణ్యంగా భావించాలి. సంగీతకారులు వినిపించే భక్తి గీతాలు మనస్సును ఆకట్టుకుంటాయి. మండల పరిధిలోని చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలే కాకుండా వికారాబాద్, శంకర్‌పల్లి, మోమిన్‌పేట, ఎన్కతల వంటి ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. గ్రామపంచాయతీ తరపున ఆలయానికి సాయం చేస్తాం. మాణిక్యప్రభు ఆలయంతో మా గ్రామ ప్రతిష్ఠ పెరిగింది.

**– న్యాలం విజయలక్ష్మి, నవాబుపేట గ్రామ సర్పంచ్**



ప్రభువును ఊరేగిస్తున్న దృశ్యం (ఫైల్)